క్లుప్తంగా

కనక మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



చొప్పెల్ల మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: చొప్పెల్లలో కొత్తగా నిర్మించిన ఆలయంలో పునః ప్రతిష్ఠించిన కనక మహాలక్ష్మి అమ్మవారికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించిన ఆలయ కమిటీని ఆయన అభినందించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి మెమొంటోను బహూకరించి సత్కరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్ తోరాటి దుర్గారావు, నాండ్ర నాగ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం భూమిలో మట్టి తవ్వకాలు

కొత్తపేట: మండల పరిధిలోని పలివెల ఉమా కొప్పేశ్వరస్వామివారి దేవస్థానం భూమిలో మట్టి అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. పలివెల–పల్లిపాలెం రోడ్డు నుంచి రావులపాలెం మండలం దేవరపల్లి శివారు మట్లదొడ్డి వెళ్లే రోడ్డులో ఉమా కొప్పేశ్వరస్వామివారి దేవస్థానానికి 1.30 ఎకరాల భూమిని ఒక రైతు కౌలుకు పాడుకుని వరి సాగు చేస్తున్నాడు. కాగా ఆ భూమిలో బుధవారం అక్రమ మట్టి తవ్వకాలు చేపట్టారు. ఆ భూమిలో మట్టి తవ్వుకుని తీసుకువెళ్లేలా అదే గ్రామానికి చెందిన ఒక మట్టి వ్యాపారికి ట్రాక్టర్ల లెక్కన మట్టి విక్రయించినట్టు సమాచారం. ఆ విధంగా జేసీబీతో మట్టి తవ్వి రవాణా సాగిస్తుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో దేవస్థానం సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారి వెళ్లి మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా తవ్వడమేమిటని సిబ్బంది నిలదీయగా, మెరకగా ఉన్నందున తవ్వుతున్నామని లీజుదారుడు సమాధానం చెప్పినట్టు సమాచారం. దేవస్థానం, రెవెన్యూ శాఖల అనుమతి తీసుకోకుండా మట్టి తరలించడం తగదని హెచ్చరించారు. దానితో ప్రస్తుతం అక్కడ మట్టి తవ్వకాలు నిలిచిపోయాయి.

పేదలకు సాయం

సఖినేటిపల్లి: విలేజ్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యాన గురువారం రామేశ్వరం పంచాయతీ వద్ద 100 మంది పేదలకు సాయం చేశారు. ఒక్కొక్కరికీ రూ.100 నగదు, 5 కిలోల బియ్యం చొప్పున అందజేశారు. ఈ సాయాన్ని సర్పంచ్ కట్టా ఉమా మహేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. కాగా దాతల సాయంతో 12 ఏళ్లుగా ప్రతి నెలా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ట్రస్ట్ ఫౌండర్ సరెళ్ల విజయ్ ప్రసాద్ తెలిపారు. అసోసియేషన్ సభ్యుడు బళ్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్ర సందేశం



సంగీత్ గీసిన చిత్రం

మలికిపురం: మానవుని మనుగడకు చెట్లు ఆధారం. సృష్టిలోని ప్రతి జీవరాశి ప్రకృతి మీదే ఆధారపడి జీవిస్తుందని స్థానిక సునయన ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ నల్లి సంగీత్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగీత్ పర్యావరణం పరిరక్షణకు వివిధ చిత్రాలను చిత్రీకరించారు. తన అకాడమీ విద్యార్థులకు ప్రదర్శన ఇచ్చారు. ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను చిత్రాలు గీసి సృజనాత్మకంగా వివరించారు.

ధీరవనిత అహల్యాబాయి హోల్కర్

సఖినేటిపల్లి: స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం మండల బీజేపీ ఆధ్వర్యంలో ధీరవనిత అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ మాట్లాడుతూ నాడు అహల్యాబాయి హోల్కర్ ఇండోర్ సంస్థాన రాణిగా 1767 నుంచి 1795 మధ్య కాలంలో పాలించారన్నారు. న్యాయ పరిపాలనలో విలువలను కాపాడారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు పోతురాజు సురేష్, ద్వాక్రా ఏపీఎం అజయ్, బోణం నాయుడు, ఇందుకూరి సుబ్బరాజు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

కొత్తపేట: అవిడి రేవు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తపేట కొప్పినశెట్టివారి వీధికి చెందిన దొంగ వెంకటకృష్ణ అమలాపురం వైపు నుంచి కొత్తపేటకు బైక్‌పై వస్తుండగా అవిడి రేవుకు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేంద్ర తెలిపారు.

మహా ప్రసాదం స్వామీ..

- అన్నదానంలో అప్పనపల్లి ఆలయానికి పేరు
- రాష్ట్రంలో ఇక్కడి నుంచే తొలిసారిగా కార్యక్రమం



అప్పనపల్లిలో స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

మామిడికుదురు: అన్నం పరబ్రహ్మ స్వరూపం.. అలాంటి అన్నదానం మహోన్నతం.. మహా అద్భుతం.. అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం అన్నదానంలో ఆదర్శంగా నిలిచింది. రాష్ట్రంలో మొదటిసారిగా అప్పనపల్లిలోనే అన్నదానానికి నాంది పలికారు. 1977లో ఆలయ వ్యవస్థాపకుడు, దివంగత మొల్లేటి రామస్వామి నిత్యాన్నదాన పథకానికి శ్రీకారం చుట్టారు. ఇతర ఆలయాల్లో అన్నదానానికి అప్పనపల్లి ఆదర్శంగా నిలిచింది. నిత్యం బూరె, పులిహోర, మూడు రకాల కూరలు, పెరుగుతో అమలు చేస్తున్న అన్నదాన పథకం ఆలయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ప్రతి రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి పదకొండు గంటల వరకూ ఈ ఆలయంలో భక్తులకు ఉచితంగా అన్నదానం చేస్తున్నారు. ఏటా లక్షలాది మంది భక్తులు ఇక్కడ స్వామివారి అన్న ప్రసాదం స్వీకరిస్తున్నారు. స్వామివారికి భక్తులు సమర్పించే విరాళాలు, డిపాజిట్లపై వచ్చే ఆదాయం ద్వారా ఈ అన్నదానాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

గణనీయంగా అన్నదానం

నిత్యం సుమారు రెండు వేల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటున్నారు. ఈ సంఖ్య శని, ఆదివారాల్లో ఎక్కువగా ఉంటుంది. స్వామి వారిని దర్శించుకునే భక్తుల్లో అధిక శాతం మంది అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. శని, ఆదివారాలు మినహా మిగిలిన రోజుల్లో నిత్యం ఏడు నుంచి ఎనిమిది వందల మంది స్వామివారి సన్నిధిలో భోజనాలు చేస్తున్నారు. గత ఏడాది 4,65,528 మంది భక్తులు ఆలయంలో అన్న ప్రసాదం స్వీకరించారు.

మహదానందం కలిగింది



అప్పనపల్లిలో అన్నదాన పథకం ఎంతో అద్భుతంగా నిర్వహిస్తున్నారు. బూరె, పులిహోర, రెండు రకాల కూరలు, సాంబారు, పెరుగు, పచ్చడితో చక్కగా అన్న ప్రసాదం అందిస్తున్నారు. ఇక్కడ భోజనం చేస్తే ఇంట్లో తిన్న అనుభూతి కలిగింది. స్వామి వారి అన్న ప్రసాదాన్ని మహదానందంగా ప్రతి భక్తుడు స్వీకరిస్తున్నాడు.

–జి.వెంకటేశ్వరరావు, తిల్లకుప్ప

నిత్యాన్నదాన పథకానికి విరాళాలుగా చెల్లించిన డిపాజిట్లు రూ.2.18 కోట్లు. దీనిపై ఏటా రూ.10.49 లక్షల వడ్డీ వస్తుంది. దీంతో పాటు భక్తులు నిత్యాన్నదానానికి గత ఏడాది భక్తులు రూ.1.47 కోట్లు విరాళాలుగా ఇచ్చారు. డిపాజిట్లపై వచ్చే వడ్డీతో పాటు భక్తులు నిత్యం స్వామివారి అన్నదాన ట్రస్టుకు ఇచ్చే విరాళాలతో ఈ పథకం నిర్వహణ నిరంతరాయంగా సాగుతోంది. గత ఏడాది రూ.72.64 లక్షల ఖర్చు అయ్యింది.

మంచి భోజనం పెడుతున్నారు



ఆలయ వ్యవస్థాపకుడు మొల్లేటి రామస్వామి హయాంలో ఇక్కడ అన్నదానం ప్రారంభించారు. నాడు ఏవిధంగా భోజనం పెట్టారో అదే విధంగా నేడు కొనసాగిస్తున్నారు. ఎంతో నాణ్యతతో అన్న ప్రసాదం వడ్డిస్తున్నారు. మన రాష్ట్రంలో ఇక్కడే అన్నదానం ప్రారంభించారు. తర్వాతే మిగిలిన ప్రముఖ ఆలయాల్లో అన్నదానం ప్రారంభించడం మన ప్రాంతం అదృష్టంగా భావిస్తున్నాం.

–నడింపల్లి అప్పలరాజు, భక్తుడు, ములికిపల్లి

భక్తుల విరాళాలతో..



అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి సన్నిధిలో భక్తులు అందించే విరాళాలతో నిత్యాన్నదాన పథకాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్నాం. దాతలు ఈ పథకానికి ఎంతో చేయూతనందిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరాయంగా స్వామి సన్నిధిలో అన్నదానం జరుగుతోంది. భక్తులు, అధికారుల సూచనలు, సలహాలతో ఈ పథకాన్ని మరింత ఉన్నతంగా నిర్వహిస్తాం.

–ముదునూరి సత్యనారాయణరాజు, ఈఓ

కామేశ మహర్షి మృతికి సంతాపం



అమలాపురం కామాక్షి పీఠంలో వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న కామేశ మహర్షి (ఫైల్)

కొత్తపేట: అమలాపురం కామాక్షి పీఠాధిపతి కామేశ మహర్షి మృతి పట్ల అల్లూరి సీతారామరాజు సేవా సంస్థ సంతాపం ప్రకటించింది. ఈ మేరకు కొత్తపేట మండలం పలివెల కేంద్రంగా సేవలు నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు సేవా సంస్థ వ్యవస్థాపకుడు దుళ్ల వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 58 ఏళ్లుగా అమలాపురంలో కామాక్షి పీఠం ద్వారా ఎన్నో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కామేశ మహర్షి కోనసీమకే ఖ్యాతిని ఆర్జించారన్నారు. 1999 ఆగస్టు 15న ఆయన చేతుల మీదుగా పలివెలలో అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా సంస్థను ప్రారంభించారని గుర్తు చేశారు. ఓ సందర్భంలో తన సేవలను గుర్తించి సత్కరించారని పేర్కొన్నారు. అలాగే కామేశ మహర్షి మృతికి అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్ వుడయార్, స్థానిక కళా సాహితీ అధ్యక్షుడు, ప్రముఖ కవి జి.సుబ్బారావు, సభ్యుడు షేక్ గౌస్ సంతాపం వ్యక్తం చేశారు.

సత్యసాయి రథానికి స్వాగతం



కొత్తపేటలో రథోత్సవానికి స్వాగతం పలుకుతున్న సమితి సభ్యులు

కొత్తపేట: భగవాన్ సత్యసాయిబాబా వారి శత జయంతి రథయాత్రకు కొత్తపేటలో ఘన స్వాగతం పలికారు. సత్యసాయి బాబా శత జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని లోక కల్యాణార్థం సత్యసాయి ప్రేమ ప్రవాహిని (రథోత్సవం) పుట్టపర్తి దివ్య క్షేత్రం నుంచి దేశ వ్యాప్తంగా ఆసేతు హిమాచల పర్యంతం శోభాయాత్రగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి, జిల్లా సేవాదళ్ కన్వీనర్ మన్యం పర్వతవర్ధనరావు, జిల్లా సమితి సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 3 జిల్లాలో ప్రవేశించిన రథయాత్ర గురువారం కొత్తపేట మండలం మోడకుర్రు శివారు గొలకోటివారిపాలెం నుంచి ప్రారంభమైంది. అక్కడి నుంచి కొత్తపేట చేరుకున్న రథయాత్రకు స్థానిక సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణ (కేఎస్ఎన్) ఆధ్వర్యంలో సమితి సభ్యులు, సత్యసాయి మహిళామండలి, కోలాటం బృందం, బాలవికాస్ బాలలు, అత్యధిక సంఖ్యలో భక్తులు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుంచి మహిళలు పూర్ణకుంభాలతో తోడ్కొని వెళ్లారు. అక్కడ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, 12 రకాల హారతులు ఇచ్చారు. రథయాత్రలో పాల్గొన్న వారికి, స్థానిక భక్తులకు స్థానిక సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో తరించాలన్నదే సత్యసాయి సందేశమని జిల్లా సేవాదళ్ కన్వీనర్ వర్ధనరావు అన్నారు. ఈ రథయాత్ర సందర్భంగా వర్ధనరావు భక్తులనుద్దేశించి మాట్లాడారు. సత్యసాయి సూక్తులను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. అనంతరం రథోత్సవం రావులపాలెం వైపునకు వెళ్లింది. సేవా సమితి సభ్యులు చొప్పెల్ల రాంబాబు, సత్యవరపు భాస్కరరావు, కంకటాల సాయిబాబు, శ్రీఘాకోళ్లపు ఎస్ఎస్ గోపాలరావు, మారిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



వాడపాలెంలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ నరేష్‌కుమార్



రాజోలు కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న జడ్జి ప్రమీలారాణి

కొత్తపేట: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వాడపాలెంలో సర్పంచ్ త్సామా బాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. దీనిని ఎంపీడీఓ ప్రారంభించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు, గ్రామ పురోహితుడు, మొక్కల ప్రేమికుడు పెద్దింటి రామచంద్ర శ్రీహరి (రామం) పాల్గొన్నారు.

ఆలమూరు: ఆలమూరులో సర్పంచ్ నేలపూడి లావణ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీఓ రాజు ప్రారంభించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

పి.గన్నవరం: పోతవరం మొగలికొంకల సెంటర్ వద్ద ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మొక్కలు నాటారు. జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ కేవీ రమణ పాల్గొన్నారు. పి.గన్నవరం కొత్త అక్విడెక్టు వద్ద మండల బీజేపీ అధ్యక్షుడు తిక్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, అడబాల సత్యనారాయణ, నల్లా పవన్‌కుమార్ మొక్కలు నాటారు.

మలికిపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి మొక్కలు నాటారు. మండల పరిషత్ ఏఓ జి.మిల్టన్, ఉపాధి హామీ పథకం ఏపీఓ టి.లక్ష్మి పాల్గొన్నారు.

అంబాజీపేట: ప్రకృతిని కాపాడుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.భీమారావు అధ్యక్షతన మొక్కలు నాటారు. ఉపాధి ఏపీఓ ఏవీ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. ముక్కామల, అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

రాజోలు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి అన్నారు. రాజోలు కోర్టు కాంప్లెక్స్‌లో ఆమె మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ చట్టం గురించి అవగాహన కల్పించారు. ఏజీపీ గుబ్బల రజిత, కోర్టు సూపరింటెండెంట్ కాంతారావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ



మోరిలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఫైర్ సేఫ్టీపై వివరిస్తున్న సిబ్బంది

సఖినేటిపల్లి: మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ అంశాలకు సంబంధించిన శిక్షణ కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్‌గా, ఎంఈఓ–2 మద్దాలి వెంకటేశ్వరరావు వ్యవహరించారు. జిల్లా ఎండీఎం ఏడీ ఎన్‌సురేష్, ఎండీఎం కంప్యూటర్ ఆపరేటర్ మౌనిక ఈ కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఇక నుంచి అన్ని పాఠశాలలకు సన్నరకం బియ్యం పంపిణీ చేస్తామని వారన్నారు. కాగా గ్యాస్ పొయ్యిలపై వంట చేసే క్రమంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ఏ విధమైన చర్యలు తీసుకోవాలో అనే అంశంపై నిర్వాహకులకు, ఫైర్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది ప్రత్యక్షంగా తెలియజేశారు. పాఠశాల హెచ్ఎం ఎస్.శ్రీధర్‌కృష్ణ, ఫైర్ స్టేషన్ సిబ్బంది సీహెచ్ అనిల్ కుమార్, ఎస్.రాంబాబు, టీచర్స్ యూనియన్ నాయకులు గోపిరాజ్, సత్యనారాయణ, హేమసుందర్ పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ఏర్పాటు



అప్పనపల్లి దేవస్థానంలో ఉత్సవ కమిటీ సభ్యులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని 17 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చైర్మన్‌గా కమిటీ ఏర్పాటు చేశారు. సభ్యులుగా కొమ్ముల కొమ్ముల రామలక్ష్మి, అడబాల వెంకటేశ్వరరావు, ముత్యాల ప్రసాద్, గంటా అంజి, వడ్డి దుర్గాదేవి, యనమదల తాతాజీ, గనిశెట్టి బాపన్న, కామిశెట్టి వీరన్న, దంగేటి నాగేశ్వరరావు, పెదసింగు లక్ష్మీ నరసింహస్వామి, పాబోలు సోమశేఖరరావు, కానేటి బాలయోగి, చిట్టూరి సత్యనారాయణ, నుదురు మాటి సత్యమాణిక్యం, గాడి సత్తిబాబు, వేగి వెంకటేశ్వరరావును నియమించారు. కమిటీ సభ్యులకు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు స్వామివారి కండువాలు కప్పి అభినందనలు తెలిపారు.

త్వైకాండో పోటీలకు ఎంపిక

పి.గన్నవరం: కాకినాడలో ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి త్వైకాండో పోటీల్లో ముంగండ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు బంగారు పతకాలను సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని కోచ్ పి.భార్గవి తెలిపారు. సబ్ జూనియర్ బాలికల 32 కిలోల విభాగంలో వి.రక్షిత, 46 కిలోల విభాగంలో ఎంపీఎస్ లక్ష్మిలు బంగారు పతకాలను సాధించారు. వీరు ఈ నెల 9 నుంచి అనంతపురంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లనున్నారు.

కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నగరం ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న లక్ష్మి

మామిడికుదురు: నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, చైర్మన్‌గా పెనుమాల లక్ష్మి, వైస్ చైర్మన్‌గా గుడాల వెంకటరమణ, సభ్యులుగా బండారు శ్రీను, బొక్కా లలితాదేవి, కండిబోటి సత్య ఈశ్వరి, కుంపట్ల మల్లికార్జునరావు, లంకే వెంకటలక్ష్మి, లూటుకుర్తి సత్యనారాయణ, నిమ్మకాయల వెంకటలక్ష్మి, నూకల వెంకటేశ్వరరావు, పెంటా ఏసుకుమారి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాత స్థిత ప్రజ్ఞకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ప్రధానార్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి కె.జగన్నాథపురం గ్రామానికి చెందిన గంగుమళ్ల హనుస్థితప్రజ్ఞ కుటుంబ సభ్యులు గురువారం రూ.11,116 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు ఇచ్చారు. దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

పాడి రైతుకు చేయూత



పెనికేరులో శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న దాత చినబాబు

ఆలమూరు: అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పాడి రైతు గోపు శ్రీనివాస్‌కు రూ.పది వేల సాయం అందజేశారు. పెనికేరులో ఇటీవల ప్రమాదవశాత్తు పశువుల పాక, గడ్డి వాము దగ్ధం కావడంతో సుమారు రూ.రెండు లక్షల వరకూ ఆస్తి నష్టం వాటిల్లగా పశువులు క్షేమంగా బయట పడ్డాయి. గ్రామానికి చెందిన వ్యాపారవేత్త ఈదల శ్రీరామ చంద్రమూర్తి (చినబాబు) స్పందించి గురువారం బాధిత రైతు శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం చేశారు. కోన శ్రీనివాస్, కొమ్ము నారాయుడు, గొడవర్తి సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.


క్రీడలపై ఆసక్తి పెంచాలి



గొందిలో క్రికెట్ టోర్నమెంట్‌లో నైపుణ్యం ప్రదర్శించిన చిన్నారులతో నాయకులు

సఖినేటిపల్లి: పిల్లలకు క్రీడల పట్ల ఆసక్తి పెంచేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ–1 కొల్లాబత్తుల నాని అన్నారు. గొంది గ్రామంలో అండర్–14 విభాగంలో క్రికెట్ టోర్నమెంట్‌ను వైస్ ఎంపీపీ నాని నేతృత్వంలో స్థానిక జ్యోతి యూత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించారు. టోర్నమెంట్‌లో నైపుణ్యం చూపిన పిల్లలకు ప్రోత్సాహక బహుమతులను వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు, నెడ్క్యాప్ మాజీ డైరెక్టర్ పాటి శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, జిల్లా నాయకుడు ఈద రవిరెడ్డి, యూత్ నాయకుడు తాడి సహదేవ్ అందజేశారు.

రాంబాబుకు పరామర్శ



రాంబాబును పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

అయినవిల్లి: మండలంలోని మాగం మాజీ సర్పంచ్ అత్తిలి రాంబాబు బ్రెయిన్ ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం ఆయన్ని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పరామర్శించారు. ఆయన వెంట మాగం గ్రామ సర్పంచ్ కాశీ సత్యనారాయణ, వేటుకూరి చందురాజు, కమిడి వెంకటేశ్వరరావు, పులిదిండి బుల్లి అబ్బులు తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల తీరుపై ఆగ్రహం



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సఖినేటిపల్లి: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటున్నారంటూ రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లికార్జునరావు అధ్యక్షతన పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. టేకిశెట్టిపాలెం ఎత్తు వంతెన నుంచి సఖినేటిపల్లి రేవు వరకూ ప్రతి ఒక్కరూ ఇష్టారాజ్యంగా ప్రధాన పంట కాలువను, ప్రధాన రహదారిని ఆక్రమించడంతో పాటు, వాటిని చెత్తాచెదారాలతో నింపుతున్నారని, ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ కార్యదర్శులను ఎమ్మెల్యే నిలదీశారు. ఎంపీపీ మల్లికార్జునరావు మాట్లాడుతూ, మండలంలో డంపింగ్ యార్డు సమస్యలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. దీనిపై తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఇప్పటికే కొన్ని ఏరియాలలో వీటిని గుర్తించామన్నారు. అనంతరం ఎంపీడీఓ సూర్యనారాయణ శాఖల వారీగా సమీక్షించారు. గొందిలో త్రీ ఫేస్ లైన్ వేస్తే విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని వైస్ ఎంపీపీ–1 కొల్లాబత్తుల శుభాకర్ అన్నారు. దీనిపై ఎలక్ట్రికల్ ఏఈ ప్రసాద్ బదులిస్తూ ఈ నెలలో గుడిమూలలో సబ్ స్టేషన్ ప్రారంభిస్తున్నామని, తద్వారా విద్యుత్ సరఫరా మెరుగు పడుతుందన్నారు.

యోగాంధ్ర కోసం శ్రమిద్దాం

ఆలమూరు: యోగాంధ్ర సాధన కోసం అందరూ శ్రమిద్దామని తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఎంపీడీఓ రాజు పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న యోగా కార్యక్రమాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ నెల 21న జరిగే జాతీయ యోగా డేలో పాల్గొనే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. గ్రామ సచివాలయాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు చురుగ్గా జరుగుతున్నట్లు పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, డి.సాయికిషోర్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

అంబాజీపేట: తైక్వాండో ట్రైనీలు ఇచ్చే శిక్షణను క్రమబద్ధంగా నేర్చుకుంటూ రాష్ట్ర స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో తైక్వాండో పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను సీఐ భీమరాజుతో పాటు ఎస్సై కె.చిరంజీవి గురువారం అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా తైక్వాండో ప్రధాన కార్యదర్శి, సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు మాట్లాడుతూ ఈ నెల 4న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తైక్వాండో 31వ ఇంటర్ క్లబ్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో జూనియర్స్ విభాగంలో వి.రష్మిక దేవి, జి.జెస్సీలేఖన, జి.లాహిరి తేజ, బీఎస్ కార్తీకన్, ఏబీ చైతన్య, పి.ఆదిత్య, క్యాడెట్ విభాగంలో బి.హేమరితిక్, ఎంఎల్‌డీ నూకేష్, ఎం.మౌనిక, జి.పూజితదేవి, సీనియర్ విభాగంలో పి.దేవా, బి.కుష్వీర్‌లు పతకాలు సాధించారు. ఈ నెల 8, 9 10 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రితో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విజేతలను హెచ్ఎం కడలి సాయిరామ్, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, కోచ్‌లు అభినందించారు.

ప్రతిభా పురస్కారానికి ఎంపిక

పి.గన్నవరం: ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన పి.గన్నవరం సాయితేజ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. లూటుకుర్తి తనూజ, మట్టపర్తి దీపిక సాయి మమత, బొక్కా నిహారికలు ఎంపికయ్యారని ఆ విద్యాసంస్థల చైర్మన్ అన్నా అనుబాబు తెలిపారు.

కళాశాలకు ఆటో సౌకర్యం

రాజోలు: కడలి ప్రభుత్వ హైస్కూల్ ప్లస్ మహిళా కళాశాల విద్యార్థినుల సౌకర్యార్థం ఆటో సౌకర్యం కల్పించామని హెచ్ఎం కడలి వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. మామిడికుదురు మండలం గోగన్నమఠం గ్రామం నుంచి పొన్నమండ, ములికిపల్లి మీదుగా కడలి మహిళా కళాశాలకు విద్యార్థినులు ఆటోలో రావచ్చన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు చదివే మూడు గ్రామాలకు చెందిన విద్యార్థినులు ఈ ఆటో సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చన్నారు. కళాశాలలో అడ్మిషన్ల కోసం ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు. విద్యా కమిటీ చైర్మన వడ్లమూడి ప్రకాశరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.